క్లుప్తంగా

రామబాణం, ధనస్సుకు పూజలు



రామబాణం, ధనస్సులకు పూజలు చేస్తున్న భక్తులు

బొండపల్లి: అయోధ్య బాల రాముడి ఆలయానికి పంపించేందుకు పంచ లోహాలతో తయారు చేసిన ధనస్సు, రామబాణానికి మండలంలోని వేంద్రాం రామాలయంలో బుధవారం ప్రత్యేక పూజలు చేశారు. చల్లా శ్రీనివాస శాస్త్రి 14 కిలోలతో రామబాణం, 16 కిలోలతో ధనస్సు తయారు చేయించారు. వీటిని అయోధ్య బాల రాముడి ఆలయానికి తరలించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

ఘనంగా అసిరితల్లి పండగ



అంజలి రథయాత్రకు పోటెత్తిన భక్తజనం

చీపురుపల్లి: మండలంలోని కర్లాంలో నాలుగు రోజులుగా అంగరంగ వైభవంగా నిర్వహించిన అసిరితల్లి పండగ మంగళవారం రాత్రితో ముగిసింది. 18 సంవత్సరాల తర్వాత గ్రామదేవత పండగ కావడంతో నాలుగు రోజులుగా స్థానికులు, బంధువులు, స్నేహితులతో గ్రామం కిక్కిరిసిపోయింది. మంగళవారం రాత్రి అంజలి రథంతో పాటు ఘటాలు ఊరేగించి అనుపోత్సవం నిర్వహించారు. బుధవారం మధ్యాహ్నం భోజనాలు కావడంతో కర్లాం వైపు వెళ్లే రహదారులన్నీ కిక్కిరిసిపోయాయి. గంటల తరబడి ట్రాఫిక్ స్తంభించిపోవడంతో వాహనదారులు ఇబ్బందిపడ్డారు.

నేడు హనుమజ్జయంతి



అభయాంజనేయ స్వామి ఆలయం

బొండపల్లి: మండలంలోని కొవ్వాడపేటలో గల అభయాంజనేయస్వామి ఆలయంలో గురువారం హనుమజ్జయంతి నిర్వహించనున్నారు. ఇందుకు సంబంధించి అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు నిర్వాహకులు తెలిపారు. ఉదయం ఆరు గంటలకు ఓంకారం, సుప్రభాత సేవతో ఉత్సవాలను ప్రారంభించనున్నారు. తర్వాత వేద పండితులతో అభిషేకాలు, బాలవికాస్ చిన్నారులచే హనుమాన్ చాలీసా పఠనం, మధ్యాహ్నం ప్రసాద వితరణ కార్యక్రమాలు చేపట్టనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమాల్లో భక్తులు పాల్గొని ఉత్సవాలను విజయవంతం చేయాలని తెలిపారు.

కొలతల ప్రకారం పనులు




ఉపాధి కార్మికులతో మాట్లాడుతున్న ఏపీఓ కామేశ్వరరావు

దత్తిరాజేరు: కొలతల ప్రకారం ఉపాధి కార్మికులు పనులు చేయాలని ఏపీఓ కామేశ్వరరావు అన్నారు. మండలంలోని గడసాంలో ఉపాధి వేతనదారులు చేస్తున్న పనులను బుధవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వం అందిస్తున్న పూర్తి స్థాయి వేతనం పొందాలంటే ప్రభుత్వ నిబంధనల ప్రకారం రెండు పూటలా పనులు చేయాలని సూచించారు. పనుల వద్ద టెంట్లు, తాగునీరు, ప్రథమ చికిత్స కిట్లు ఏర్పాటు చేసుకోవాలన్నారు.

నేటి నుంచి కుష్టు వ్యాధి గుర్తింపు శిబిరాలు

కొత్తవలస: మండల కేంద్రంలోని పీహెచ్‌సీ పరిధి కొత్తవలస – 2, దేశపాత్రునిపాలెం, కంటకాపల్లి సచివాలయాల పరిధిలో గురువారం నుంచి 24వ తేదీ వరకు కుష్టు వ్యాధి గుర్తింపు శిబిరాలు నిర్వహించనున్నట్లు వైద్యురాలు డి.సీతల్‌వర్మ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. వైద్య సిబ్బంది ఇంటింటికీ తిరిగి వ్యాధిగ్రస్తులను గుర్తించి, కౌన్సిలింగ్ నిర్వహిస్తారని పేర్కొన్నారు. కుష్టును ముందుగా గుర్తిస్తే నివారణ సాధ్యమన్నారు. రోగులకు ఆరు నెలల పాటు ప్రభుత్వం మందులు అందజేస్తుందని పేర్కొన్నారు.

రోడ్లా.. చెరువులా..!



వేపాడ: చెరువును తలపిస్తున్న ముకుందపురం రోడ్డు



గజపతినగరం: మెంటాడ జంక్షన్, కరూర్ వైశ్యాబ్యాంక్ సమీపంలో నిలిచిన వర్షపు నీరు

మేం అధికారంలోకి వస్తే రోడ్లన్నీ బాగు చేస్తామని కూటమి నాయకులు గొప్పగా చెప్పుకున్నారు. తీరా అధికారంలోకి వచ్చి ఏడాదైనా రోడ్లను అభివృద్ధి చేసిన దాఖలాలు లేవు.. కొన్ని చోట్ల మరమ్మతులు చేపట్టినా నాసిరకం పనుల కారణంగా ఆ రోడ్లన్నీ పాడయ్యాయి. చిన్నపాటి వర్షానికి కూడా రోడ్లన్నీ చెరువులను తలపిస్తున్నాయి. దీంతో వాహనదారులు రాకపోకలకు ఇబ్బంది పడుతున్నారు. వేపాడ, గజపతినగరం, కొత్తవలస మండలాల్లో బుధవారం కురిసిన ఓ మోస్తారు వర్షానికి రోడ్లన్నీ చెరువులను తలపించాయి. కాలువలు సక్రమంగా లేకపోవడంతో వర్షపు నీటితో పాటు కాలువ నీరు కూడా రోడ్లపైనే నిలిచిపోయింది. కొత్తవలసలో దుకాణాల్లోకి సైతం నీరు చేరిపోయింది. దీంతో వాహన చోదకులు, ప్రజలు ఇబ్బంది పడ్డారు. ఇదిలా ఉంటే ఈ వర్షం నువ్వు పంటను నాశనం చేస్తుందని రైతులు ఆందోళన చెందుతున్నారు.

– వేపాడ/గజపతినగరం/కొత్తవలస



కొత్తవలస: కొత్తవలస మూడు రోడ్లు జంక్షన్‌లో షాపుల్లోకి ప్రవేశించిన వరద నీరు



కొత్తవలస: అరుకు - విశాఖ జాతీయ రహదారిలో తుమ్మికాపల్లి ఫైర్ స్టేషన్ సమీపంలో రోడ్డుపై నుంచి ప్రవహిస్తున్న వరద నీరు

ప్రమాదకరంగా విద్యుత్ స్తంభం..



గజపతినగరం మండలంలోని ఎం.వెంకటాపురం నుంచి డోలపాలెం గ్రామానికి వెళ్లే మార్గంలో ఉన్న విద్యుత్ స్తంభం ప్రమాదకరంగా మారింది. దీంతో ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని గ్రామస్తులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు స్పందించి స్తంభాన్ని మార్చాలని ఎం. వెంకటాపురం, డోలపాలెం, పాత శ్రీరంగరాజపురం, పిడిశీల, కాలంరాజుపేట, సీతారామపురం, తదితర గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

– గజపతినగరం

పొంచి ఉన్న ప్రమాదం..



చీపురుపల్లి పట్టణంలోని విజయనగరం – పాలకొండ ప్రధాన రహదారిలో రైల్వేస్టేషన్ దాటిన తర్వాత ఉన్న వంతెనపై బీటీ రోడ్డు గుంతలుగా మారింది. ఈ రహదారిపై నిత్యం వందలాది వాహనాలు రాకపోకలు సాగిస్తుంటాయి. గోతుల్లో పడి ద్విచక్ర వాహనదారులు ప్రమాదాల బారిన పడుతున్నారు. వర్షాలు పడినప్పుడు గోతుల్లో నీరు చేరడంతో వాహన చోదకులు ఇబ్బంది పడుతున్నారు. అధికారులు స్పందించి గోతులను పూడ్చాలని చీపురుపల్లి, పాలకొండ, రాజాం, తెర్లాం, గరివిడి మండల ప్రజలు కోరుతున్నారు.

– చీపురుపల్లి

పీడబ్ల్యూడీ ఓటర్లకు పూర్తి స్థాయి సదుపాయాలు

• ఇన్‌చార్జ్ ఆర్డీఓ ఆనయ్య



సమావేశంలో మాట్లాడుతున్న ఇన్‌చార్జ్ ఆర్డీఓ ఆనయ్య

చీపురుపల్లి: పోలింగ్ సమయంలో పీడబ్ల్యూడీ (పర్సన్ విత్ డిజేబులిటీస్) ఓటర్లు తమ ఓటు హక్కు వినియోగించుకునే సమయంలో స్వేచ్ఛాయుత వాతవరణంతో పాటు పూర్తి స్థాయిలో సదుపాయాలు కల్పించనున్నట్లు నియోజకవర్గ ఓటరు నమోదు అధికారి, ఇన్‌చార్జ్ ఆర్డీఓ బి.ఆనయ్య అన్నారు. బుధవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో నియోజకవర్గ స్థాయి ఏసీసీఏఈ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పోలింగ్ ప్రక్రియలో పీడబ్ల్యూడీ ఓటర్లకు అనుకూలమైన వాతావరణం కల్పించడం కోసం ప్రతి మూడు నెలలకోసారి కమిటీ సమావేశమై చర్చించుకోవాల్సి ఉంటుందన్నారు. పీడబ్ల్యూడీ వ్యక్తుల్లో అర్హులైన వారందరికీ ఓటుహక్కు కల్పించాలన్నారు. వారిని క్యూలైన్లలో నిల్చుని ఉండకుండా ప్రత్యేకంగా పోలింగ్ కేంద్రాల్లోకి పంపించాలని సూచించారు. అంతేకాకుండా వారి అనుమతితో సహాయకుల్ని కూడా నియమించాల్సి ఉంటుందన్నారు. కార్యక్రమంలో నియోజకవర్గ స్థాయి ఏసీసీఏఈ కమిటీ సభ్యులు తహసీల్దార్ ఎస్.రాజారావు, ఎంపీడీఓ ఎల్.త్రినాథ, ఎంఈఓ ఎం.బూసినాయుడు, ఏబీసీడబ్ల్యూఓ ఎం.యశోధ నరావు, మానవీయత స్వచ్ఛంద సంస్థ అధ్యక్షుడు బీవీ గోవిందరాజులు, పీడబ్ల్యూడీ ప్రతినిధులు టి.లక్ష్మణరావు, ఎం.రామునాయుడు పాల్గొన్నారు.

రైతులందరికీ కంపోస్టు పిట్‌లు



కాలంరాజుపేటలో కంపోస్ట్ పిట్‌లను పరిశీలిస్తున్న ఏపీఓ కృష్ణవేణి

గజపతినగరం: పాడి పశువులు కలిగి ఉన్న రైతులందరూ కంపోస్టు పిట్‌లు కలిగిఉండాలని ఏపీఓ కృష్ణవేణి అన్నారు. కాలంరాజుపేటలో ఉపాధి నిధులతో ఏర్పాటు చేసిన కంపోస్టుపిట్‌లను (పెంట గుంతలు) బుధవారం ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ప్రతి పంచాయతీలో 30 కంపోస్టు పిట్‌లు ఏర్పాటు చేసి రైతులకు అందజేస్తున్నట్లు చెప్పారు. గుంతల్లో వేసిన వ్యర్థాలు కంపోస్టు ఎరువులా తయారావుతుందని, తద్వారా ఈ ఎరువును పంట పొలాలకు వినియోగించుకోవాలని సూచించారు. ప్రస్తుతం కాలంరాజుపేట, పిడిశీల, సీతారామపురం, తదితర గ్రామ పంచాయతీల్లో వీటిని ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు.

మెగా జాబ్‌మేళాకు అనూహ్య స్పందన



సోమలింగాపురంలో జాబ్‌మేళాకు హాజరైన యువత

మెరకముడిదాం: మండలంలోని సోమలింగాపురం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో డాక్టర్ రెడ్డీస్ ఫార్మా యాజమాన్య ప్రతినిధులు బుధవారం నిర్వహించిన జాబ్‌మేళాకు అనూహ్య స్పందన లభించింది. ఈ జాబ్‌మేళాకు మొత్తం 124 మంది యువతీయువకులు హాజరయ్యారు. వీరికి ఇంటర్వ్యూలు నిర్వహించిన యాజమాన్య ప్రతినిధులు 25 మందిని ఎంపిక చేశారు. వీరికి ఫార్మా పరిశ్రమలకు అవసరమైన విద్యను ఉచితంగా అందించి కోర్సు పూర్తయిన తర్వాత ఆయా పరిశ్రమల్లో వీరికి ఉద్యోగ అవకాశాలను ఇస్తారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ శ్రీనివాసరావు, నిర్వాహకులు ఎం.వర్మ, ఎస్.రామరాజులు, ఫార్మా కంపెనీ యాజమాన్య ప్రతినిధులు పాల్గొన్నారు.

రాజీయే రాజమార్గం

గజపతినగరం రూరల్: రాజీయే రాజమార్గమని కక్షిదారులు భావించాలని, వచ్చే నెల 5, 7వ తేదీలలో జరగనున్న జాతీయ మెగా లోక్‌అదాలత్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని గజపతినగరం జ్యుడీషియల్ మేజిస్ట్రేట్ ఆఫ్ ఫస్ట్‌క్లాస్ న్యాయమూర్తి ఎ.విజయరాజ్‌కుమార్ బుధవారం ఒక ప్రకటనలో కోరారు. కక్షిదారులు, కోర్టు సిబ్బంది, న్యాయవాదులు హాజరుకావాలన్నారు.

రెవెన్యూ ఆఫీసర్స్ సమావేశం నేడు

గజపతినగరం: మండల కేంద్రంలోని పాల్తేరు వారి కల్యాణ మంటపంలో గజపతినగరం నియోజకవర్గ స్థాయి రెవెన్యూ ఆఫీసర్స్ సమావేశం నిర్వహించనున్నట్లు తహసీల్దార్ బి.రత్నకుమారి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. కార్యక్రమానికి కలెక్టర్ డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ హాజరుకానున్నారని పేర్కొన్నారు. మెంటాడ మండలంతో పాటు గజపతినగరం, దత్తిరాజేరు, బొండపల్లి, గంట్యాడ, జామి మండలాల రెవెన్యూ అధికారులు హాజరుకావాలని కోరారు.

జ్యూస్ షాపులో అగ్ని ప్రమాదం

గజపతినగరం రూరల్: నియోజకవర్గ కేంద్రంలోని నాలుగు రోడ్ల కూడలిలో ఉన్న జ్యూష్ షాపులో బుధవారం తెల్లవారుజామున విద్యుత్ షార్ట్ సర్క్యూట్ వల్ల అగ్ని ప్రమాదం సంభవించినట్లు గజపతినగరం అగ్నిమాపక అధికారి రవిప్రసాద్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. స్థానికుల సమాచారం మేరకు సిబ్బంది వచ్చి మంటలను అదుపు చేశారని చెప్పారు. రూ. 20 వేల ఆస్తి నష్టం జరిగినట్లు తెలిపారు.

వసతిగృహాల తనిఖీ



ఎస్.కోట సబ్‌జైలులో రికార్డులు పరిశీలిస్తున్న న్యాయమూర్తి కనకలక్ష్మి

శృంగవరపుకోట: పట్టణంలోని ప్రభుత్వ వసతి గృహాలను స్థానిక జూనియర్ సివిల్ జడ్జి, మండల న్యాయసేవా కమిటీ చైర్మన్ బి.కనకలక్ష్మి బుధవారం పరిశీలించారు. జిల్లా న్యాయమూర్తి ఆదేశాల మేరకు ఆమె సాంఘిక సంక్షేమ వసతిగృహం, బీసీ సంక్షేమ వసతిగృహం, గిరిజన సంక్షేమ వసతిగృహాలను సందర్శించి సౌకర్యాలు, వసతులపై ఆరా తీశారు. సాంఘిక సంక్షేమ వసతిగృహం మినహా మిగిలిన వసతిగృహాల్లో ఎక్కడా కనీస వసతులు, సదుపాయాలుల్లేవని.. భవనాలు కూడా శిథిలావస్థకు చేరుకున్నాయని గుర్తించారు. ఈ విషయాలను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లనున్నట్లు సివిల్ జడ్జి తెలిపారు. అనంతరం ఆమె స్థానిక ఉప కారాగారాన్ని సందర్శించి రిమాండ్ ఖైదీలతో మాట్లాడారు. వారి ఆరోగ్య వివరాలు, కేసుల గురించి అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో సబ్‌జైలర్, పలువురు న్యాయవాదులు పాల్గొన్నారు.

బినామీ మస్తర్లపై విచారణ జరిపించండి

• ఎంపీపీ హైమావతి



ఏపీఓ సుందరరావును ప్రశ్నిస్తున్న ఎంపీపీ హైమావతి

గంట్యాడ: మండలంలోని నరవ గ్రామంలో బినామీ మస్తర్లు వేసినట్లు ఫిర్యాదులు వచ్చాయని.. వాటిపై విచారణ జరిపించాలని ఎంపీపీ పీరుబండి హైమావతి ఉపాధి హామీ అధికారులను ఆదేశించారు. బుధవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ హైమావతి అధ్యక్షతన మండల పరిషత్ సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వ్యవసాయం, విద్య, గృహనిర్మాణం, విద్యుత్, వైద్యం, ఉద్యాన, తదితర శాఖలపై సమీక్ష నిర్వహించారు. నరవ గ్రామంలో కొంతమంది మేట్‌లు వారి కుటుంబ సభ్యుల పేరిట దొంగ మస్తర్లు వేసుకుని అక్రమాలకు పాల్పడ్డారని సర్పంచ్ పి.భాస్కరరావు ఎంపీపీ, జెడ్పీటీసీ సభ్యులకు లిఖిత పూర్వకంగా ఫిర్యాదు చేశారు. దీనికి ఎంపీపీ స్పందిస్తూ వెంటనే విచారణ చేపట్టాలని బినామీ మస్తర్లపై విచారణ చేపట్టాలని ఉపాధి ఏపీఓ సుందరరావును ఆదేశించారు. అనంతరం ఎంపీపీ మాట్లాడుతూ.. ప్రజాప్రతినిధులు సూచించిన సమస్యలను అధికారులు పరిష్కరించాలన్నారు. గ్రామాలను ఆహ్లాదకరంగా తీర్చిదిద్దాలన్నారు. సీజనల్ వ్యాధులు ప్రబలకుండా చర్యలు చేపట్టాలని సూచించారు. సమావేశంలో జెడ్పీటీసీ సభ్యుడు వర్రి నరసింహమూర్తి, ఎంపీడీఓ రమణమూర్తి, తహసీల్దార్ నీలకంఠేశ్వర రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

నూతన భవనంలో అన్ని సౌకర్యాలు

• జిల్లా న్యాయమూర్తి ఎం.బబిత



నూతన భవనం నిర్మాణ డిజైన్‌ను పరిశీలిస్తున్న జిల్లా న్యాయవాది బబిత

శృంగవరపుకోట: పట్టణంలో నూతనంగా నిర్మించనున్న కోర్టు భవనంలో అన్ని సౌకర్యాలు ఉండేలా చూడాలని రోడ్లు, భవనాల శాఖ ఇంజినీర్లను జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఎం.బబిత సూచించారు. నిర్మాణంలో ఉన్న కోర్టు భవనం, పాత భవనం, మేజిస్ట్రేట్ క్వార్టర్స్‌లను బుధవారం ఆమె పరిశీలించారు. అనంతరం కోర్టు భవనానికి వచ్చిన జిల్లా న్యాయమూర్తికి ఎస్.కోట జూనియర్ సివిల్ జడ్జి బి.కనకలక్ష్మి, న్యాయవాదులు సంఘం అధ్యక్షుడు జి.సూరిదేముడు పుష్పగుచ్ఛాలు అందజేసి స్వాగతించారు.ఈ సందర్భంగా ఆమె కోర్టు భవనం డిజైన్‌ను పరిశీలించారు. నూతన భవన నిర్మాణానికి రూ. 8.5 కోట్లు, మేజిస్ట్రేట్ నివాస గృహానికి రూ. 2.23 కోట్లు, పాత భవనాల తొలగింపునకు రూ. 7 లక్షలతో ప్రతిపాదనలు చేసినట్లు ఆర్అండ్‌బీ ఎస్.కోట సెక్షన్ ఏఈ స్వామి, ఎల్.కోట సెక్షన్ ఏఈ శ్రీనివాస్ వివరించారు. కోర్టు భవనం జీ ప్లస్ 2 విధానంలో ఉంటుందని, కోర్టు ప్రాంగణంలో ఏటీఎం, కక్షిదారులకు ప్రత్యేకంగా బాత్‌రూమ్‌లు, మరుగుదొడ్లు ఏర్పాటు చేస్తున్నట్లు న్యాయమూర్తి దృష్టికి తీసుకువచ్చారు. కార్యక్రమంలో సెకండ్ క్లాస్ మెజిస్ట్రేట్ అప్పలనాయుడు, సీనియర్ న్యాయవాదులు ఎస్‌టీవీ దాసు, జి.ప్రకాష్, డబ్ల్యూఎస్ శర్మ, వారాది ఈశ్వరరావు, టీవీఆర్ మూర్తి, వెంకటరావు, రామకృష్ణ, నాయుడు, చిట్టిబాబు, సంతోష్ శేఖర్, తదితరులు పాల్గొన్నారు

ప్రజలందరికీ అంబేడ్కర్ చరిత్ర



అంబేడ్కర్ పోరాట చరిత్ర పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న నాయకులు

శృంగవరపుకోట: డాక్టర్ బాబాసాహెబ్ అంబేడ్కర్ జీవిత పోరాట చరిత్రను ప్రజలందరికీ అందిస్తామని ప్రజా వాగ్గేయకారుడు ఆతవ ఉదయ భాస్కర్ అన్నారు. బుధవారం స్థానిక దేవీ జంక్షన్‌లోని అంబేడ్కర్ విగ్రహం వద్ద 'అంబేడ్కర్ ఎవరు.. ఆయన ఏం చేశారు..' అనే పుస్తకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా పుస్తక రచయిత ఉదయభాస్కర్ మాట్లాడుతూ.. 50 వేల పుస్తకాలను ప్రజలకు అందించేందుకు సిద్ధంగా ఉన్నామన్నారు. అంబేడ్కర్ జీవితంలో చేసిన పోరాటాలు, సాధించిన విజయాలు, బడుగు, బలహీనులు, దళితులు, గిరిజనుల సాధికారత కోసం వారి జీవితాల్లో వెలుగు నింపడం కోసం ఆయన చేసిన కృషిని పుస్తకంలో వివరించినట్లు తెలిపారు. కార్యక్రమంలో డీలర్ల సంఘ గౌరవాధ్యక్షుడు బుగత వెంకటేశ్వరరావు, ఉద్యమ నాయకులు డప్పు రాజు, బోనెల ఈశ్వరరావు, కె.వెంకటప్పారావు, మొయ్యి వెంకటరమణ, తదితరులు పాల్గొన్నారు.

యోగాతో సంపూర్ణ ఆరోగ్యం



క్రీడాకారులతో యోగాసనాలు వేస్తున్న ఎమ్మెల్సీ రఘురాజు

శృంగవరపుకోట: అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా పట్టణంలోని మోక్ష విద్యామందిర్ ఆధ్వర్యంలో బుధవారం ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా మోక్ష విద్యామందిర్ ప్రతినిధి కోటేశ్వరరావు, యోగా సాధకుడు అప్పారావు మాట్లాడుతూ..యోగాతో సంపూర్ణ ఆరోగ్య సిద్ధిస్తుందని చెప్పారు. యోగాంధ్రలో భాగంగా ప్రభుత్వం నేటి నుంచి నెల రోజుల పాటు ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించనుందని చెప్పారు.

యోగాంధ్ర దినోత్సవం ప్రారంభం

స్థానిక కేంబ్రిడ్జి నారాయణ పాఠశాలలో వేసవి బ్యాడ్మింటన్ శిక్షణ శిబిరంలో భాగంగా చీఫ్ కోచ్ శ్రీరాములు ఆధ్వర్యంలో యోగాంధ్ర దినోత్సవాలు ప్రారంభమయ్యాయి. జిల్లా బ్యాడ్మింటన్ అసోసియేషన్ చైర్మన్ రఘురాజు ముఖ్య అతిథిగా పాల్గొని శిక్షణ పొందుతున్న 105 మంది క్రీడాకారులతో యోగాసనాలు వేయించారు. జూన్ 21 వరకు యోగాంధ్ర కార్యక్రమాలు కొనసాగుతాయని చెప్పారు.